ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే సీఎం లక్ష్యం



అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే నాగిరెడ్డి



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

- రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సదుపాయాలతో హెల్త్ సెంటర్లు
- మంత్రి విడదల రజిని
- గంగవరంలో యూపీహెచ్‌సీ ప్రారంభం

పెదగంట్యాడ: రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి , జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని అన్నారు. వైద్య, ఆరోగ్య రంగానికి సీఎం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు అత్యాధునిక సదుపాయాలతో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. జీవీఎంసీ 64వ వార్డు పరిధి గంగవరం గ్రామంలో రూ.కోటి ఐదు లక్షలతో కొత్తగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంగవరంలోని నాలుగు గ్రామాల్లో ఉంటున్న సుమారు 25 వేల నుంచి 30 వేల మంది ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఈ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో ఇక్కడ ఎటువంటి వైద్య సదుపాయాలు లేకపోవడంతో జబ్బులు వస్తే నగరం వరకూ వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడిక ఆ పరిస్థితి ఉండదని, ఈ కేంద్రంలోనే అన్ని పరీక్షలు చేయడంతో పాటు మంచి వైద్యం చేసి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. రానున్న కాలంలో మంచంపై ఉన్న రోగుల వద్దకే వైద్యులు వెళ్లి చికిత్స అందించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. విశాఖ జిల్లాలో ఇప్పటి వరకూ 42 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయని, వాటిలో 38 నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించామని, 4 నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. వాటిని త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తాం

గంగవరం పోర్టులో పని చేస్తున్న మత్స్యకారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి విడదల రజిని ప్రకటించారు. పోర్టు ఉద్యోగుల వేతనాల్లో తేడాపై యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు. ఇక్కడి సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో మత్స్యకారులకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు.

ఎన్నో ఏళ్ల కల.. నెరవేరిన వేళ..

అనారోగ్యం వస్తే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని, నగరంలో ఆస్పత్రులకు వెళ్లే పరిస్థితి ఉండేదని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఇక్కడ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం ఎన్నో ఏళ్ల కల అని, అది ఇప్పుడు సాకారమైందని చెప్పారు. గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన మత్స్యకారుల పక్షాన నిలబడి, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే ఇక్కడి జటిలమైన సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. గంగవరం పోర్టు యాజమాన్యంతో చర్చలు జరిపామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డి.జగదీశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రామిరెడ్డి, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ వినయ్, జోనల్ కమిషనర్ సింహాచలం, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు దల్లి గోవిందరాజు, బొడ్డు నర్సింహపాత్రుడు, భూపతిరాజు సుజాత, రాజాన రామారావు, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, నాయకులు, పల్లా చినతల్లి, పూర్ణానంద శర్మ, బోగాది సన్నీ, కోమటి శ్రీనివాసరావు, మంత్రి శంకరనారాయణ, యువశ్రీ, బొడ్డ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

గంగవరం గ్రామంలో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు మంత్రి విడదల రజినికి వినతిపత్రాలు సమర్పించారు.

రెండేళ్ల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు రెండు సంవత్సరాల నుంచి కార్మికులు పట్టు వదలకుండా చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 694వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సింటర్ ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ, డి.నర్సింగరావు, సీహెచ్.సన్యాసిరావు, గుమ్మడి నరేంద్ర మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతూ పోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థ కూడా మిగలదన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ, ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జన యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.వి.భాస్కర్, అప్పలరెడ్డి, ఎం.నాగేశ్వరరావు, ప్రసాద్, కె.వి.సత్యనారాయణ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తత అవసరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న క్రైం ఎస్‌ఐ మహేష్

అక్కిరెడ్డిపాలెం: నేరాలపై అప్రమత్తత అవసరమని గాజువాక క్రైం ఎస్‌ఐ మహేష్ అన్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద స్థానికులకు శుక్రవారం అవగాహన కల్పించారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నందున, ఎవరైనా ఊరు వెళ్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. వారి ఇళ్లకు భద్రత కల్పిస్తామని చెప్పారు. విలువైన వస్తువులు, బంగారం, నగదు ఇళ్లలో ఉంచుకోరాదని తెలిపారు. సెల్ ఫోన్లలో యాప్‌ల ద్వారా వారి అకౌంట్లలో డబ్బులు కాజేస్తున్నారని, వచ్చిన ప్రతీ యాప్ లింక్‌ను నొక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్రైం డీసీపీ నాగన్న ఆదేశాల మేరకు సమస్యాత్మక ప్రాంతాల్లో నేరాలపై స్థానికులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఎస్‌ఐ మహేష్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వరహాలు, పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి నిరంతర కృషి



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 64వ వార్డు దిబ్బపాలెంలో శుక్రవారం ఆయన పర్యటించారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, బోగాది సన్నీ తదితర నాయకులు పాల్గొన్నారు.

'ఉక్కు' అంశంలో కేంద్రంపై ఒత్తిడి తేవాలి



గౌతమ్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్‌టీయూసీ నాయకులు

గాజువాక : ఎన్నో త్యాగాలతో ఆంధ్రులు సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఉక్కు వైఎస్సార్‌టీయూసీ నాయకులు కోరారు. విశాఖ విచ్చేసిన వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డిని యూనియన్ నాయకులు శుక్రవారం కలిసి చర్చించారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 692 రోజులుగా పోరాటం సాగుతోందని, ఈ నేపథ్యంలో కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందని వివరించారు. గౌతమ్‌రెడ్డిని కలిసిన వారిలో కార్పొరేటర్ పి.వి.సురేష్, నాయకులు బద్రీనాథ్, ఎస్.చంటి, వై.మస్తానప్ప, రాయపురెడ్డి అనిల్ కుమార్, కర్రి దాలినాయుడు, మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, ఎం.జగ్గారావు తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు గంగవరం విద్యార్థులు



కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం స్వప్న ప్రియారెడ్డి

పెదగంట్యాడ: విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు తమ పాఠశాల నుంచి విద్యార్థులు ఎంపికయ్యారని గంగవరం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని స్వప్నప్రియారెడ్డి తెలిపారు. వారిని శుక్రవారం ఆమె అభినందించారు. ఆమె మాట్లాడుతూ బాలికల సీనియర్ కబడ్డీ విభాగంలో జి.కావ్య, బి.దివ్య, వై హారిక, అలాగే చిత్తూరు జిల్లాలో నిర్వహించనున్న జూనియర్ కబడ్డీ బాలికల విభాగంలో ఎం .మానస, కోమలి, కావ్య, సోమేశ్వరి ఎంపికయ్యారన్నారు. విజయవాడలో నిర్వహించనున్న స్విమ్మింగ్ పోటీలకు టి.మహేష్, దుర్గారావు, పైడి రాజు, నూకరాజు ఎంపికైనట్లు వివరించారు.

యూజర్ చార్జీల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్

గాజువాక : 67వ వార్డులోని వాణిజ్య, వ్యాపార సంస్థల నుంచి యూజర్ చార్జీల వసూళ్లపై జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 18 సంస్థల నుంచి రూ.20వేలను వసూలు చేశారు. ఈ డ్రైవ్ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి మురళీధరన్ తదితరులు

గాజువాక : బీజేపీ గాజువాక కో–ఆర్డినేటర్ కరణం రెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కేంద్ర మంత్రి మురళీధరన్, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే విష్ణు కుమార్‌రాజు, జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, నాయకులు పొలిమేర శ్రీను,శశిధరన్ పిళ్లై, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంది దాడిలో ఒకరికి గాయాలు

పెదగంట్యాడ: మండలంలోని అరుణా థియేటర్ వెనుక ఓ వ్యక్తిపై పంది దాడి చేసింది. తీవ్రంగా గాయపరిచింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదగంట్యాడకు చెందిన పి.నాగేంద్ర (37) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఆయన పని ముగించుకుని తిరిగి వస్తుండగా, అరుణా థియేటర్ వెనుక ఓ నిర్జన ప్రదేశంలో మూత్ర విసర్జన చేస్తుండగా ఒక్కసారిగా ఓ పంది దాడి చేసి, తీవ్రంగా గాయపరిచింది. స్థానికులు గమనించి, వెంటనే పందిని తరిమివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనపై సమాచారం అందుకున్న జీవీఎంసీ అధికారులు అక్కడికి చేరుకుని, 8 పందులను షూట్ చేశారు. గాయపడిన నాగేంద్రను పందుల పెంపకందారులు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ప్రస్తుతం నాగేంద్ర పరిస్థితి బాగానే ఉంది.

వైఎస్సార్ బీమా పంపిణీ

గాజువాక : మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా అండగా నిలుస్తుందని 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ అన్నారు. వార్డులోని ఇందిరా కాలనీకి చెందిన గెంబలి కుమార్ రాజు అనారోగ్యంతో మృతి చెందగా, వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరైంది. తక్షణ సహాయం కింద రూ.10 వేలను కుమార్‌రాజు కుటుంబానికి కార్పొరేటర్ అందజేశారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు ద్వారా చెల్లిస్తామని పేర్కొన్నారు. షఫీ, దుబాయ్‌బాషా, ఎస్‌కే ఆశ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి



పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేష్ గౌడ్

ఉక్కునగరం: యువత చెడు సావాసాలు వీడి, క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఉత్తరాంధ్ర సర్దార్ గౌతు లచ్చన్న గీత సహకులాల యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏకుల వెంకటేష్ గౌడ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో జరుగుతున్న జాతీయ పవర్ లిఫ్టింగ్ రెండో రోజు పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతోందన్నారు. జాతీయ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామ్‌నాథ్ సింగ్, లియో పీటర్ మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపితే ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. నేషనల్ అఫీషియల్ అండిబోయిన లక్ష్మీదేవి, ఏపీ లిఫ్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భాస్కరరావు, అండిబోయిన అప్పారావు, ఆంధ్రకేసరి కళాక్షేత్రం కార్యదర్శి సిహెచ్.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఎన్నికలు నేడు



స్టీల్‌ప్లాంట్‌లో ఎన్నికల కోలాహలం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలకు యాజమాన్యం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. హెచ్‌ఆర్ జీఎం కె. సంజీవరావు పర్యవేక్షణలో స్టీల్‌ప్లాంట్ ఎం.ఎం విభాగం డీజీఎం జె.వి.రావు రిటర్నింగ్ అధికారిగా శనివారం ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 2954 మంది ఉద్యోగులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. ప్లాంట్‌లోని ఉద్యోగుల కోసం క్యూఏటీడీ విభాగం, ప్లాంట్ బయట ఉన్న ఉద్యోగుల కోసం ఎల్ అండ్ డీసీ కేంద్రాలను పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. క్యూఏటీడీలో 2,772 మందికి రెండు పోలింగ్ బూత్‌లు, ఎల్ అండ్ డీసీలో 189 మందికి ఒక బూత్ ఏర్పాటు చేశారు. మైన్స్, మార్కెటింగ్ ఔట్ స్టేషన్లలో 23 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఇందులో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు సందీప్, డి.వంశీరామ్ పర్యవేక్షణలో 25 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 5 గంటలకు కౌంటింగ్ నిర్వహించి, ఫలితాలు వెల్లడిస్తామని ఆర్వో జె.వి.రావు తెలిపారు.

5 ఎస్ పోటీల్లో ఏసీఎస్ జట్టుకు అవార్డు



విజేతలను అభినందిస్తున్న వర్క్స్ సీజీఎం చక్రవర్తి

ఉక్కునగరం: పని ప్రదేశ నిర్వహణకు సంబంధించిన 5ఎస్ జాతీయ స్థాయి పోటీల్లో స్టీల్‌ప్లాంట్ ఏసీఎస్ విభాగం జట్టుకు పార్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఔరంగాబాద్‌లో ఇటీవల క్వాలిటీ సర్కిల్, ఫైవ్ ఎస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విభాగం ఉద్యోగులు కె. విజయలక్ష్మి, స్నిగ్ధ రాణి మెహర్, వి.వి.వి. సత్యనారాయణ, రంగ, టి. దేముడమ్మ జట్టు ఈ అవార్డు గెలుపొందారు. అదే విధంగా జట్టు సభ్యులు అక్కడ ఫైవ్ ఎస్‌పై లఘు నాటిక ప్రదర్శించి, అందరి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జట్టు సభ్యులను సీజీఎం (వర్క్స్) అభిజిత్ చక్రవర్తి, సీజీఎం (మెయింటెనెన్స్) మహంతి, విభాగాధిపతి డాక్టర్ వి. చిట్టిబాబు, అధికారులు అభినందించారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు సహకరించాలని వినతి



మంత్రి అమర్‌నాథ్‌తో ఐలా చైర్మన్ రఘు, కార్యదర్శి సత్యనారాయణ

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ ఎఫ్–బ్లాక్‌లో చుక్కవానిపాలెం వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) నిర్మాణ పనులు కొనసాగేలా సహకారం అందించాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆటోనగర్ ఐలా చైర్మన్ రఘు, కార్యదర్శి చీకటి సత్యనారాయణ కోరారు. మిందిలో ఆయన్ను శుక్రవారం కలిసి సమస్యను వివరించారు. ఆటోనగర్‌లోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు కొన్ని అనుమతుల వల్ల జాప్యం జరుగుతున్నాయని తెలిపారు. పనులు త్వరితగతిన ప్రారంభించేలా చూడాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఫైల్స్ పరిశీలించి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని, పనులు సత్వరం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఐలా ప్రతినిధులు తెలిపారు.

వారం రోజుల్లో భద్రతా చర్యలు చేపట్టాలి

- లేనిపక్షంలో పాఠశాలలపై చర్యలు
- స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావు



పాఠశాలల ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

ఉక్కునగరం: పాఠశాలల పరిసరాల్లో భద్రతా చర్యలు సత్వరం పూర్తి చేయాలని స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావు సూచించారు. ఉక్కునగరంలోని పాఠశాలల ప్రిన్సిపాల్స్, నిర్వాహకులతో స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో సమీక్ష నిర్వహించారు. గత సమావేశంలో నిర్ణయించిన అంశాల పురోగతి గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల సమీపంలో స్కూల్ జోన్ బోర్డుల ఏర్పాటు, హోంగార్డుల పర్యవేక్షణ, ఆయా కూడళ్ల వద్ద స్టాపర్ల అమరిక గురించి మాట్లాడారు. డీపాల్ పాఠశాల మినహా మిగతా పాఠశాలలు తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. వారంలోగా సమావేశంలో నిర్ణయించిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు

72వ వార్డులో కొత్త పింఛన్ల పంపిణీ



పింఛన్లను అందజేస్తున్న వాసు

గాజువాక : జీవీఎంసీ 72వ వార్డులో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రూ.2 వేల నుంచి మొదలైన పింఛన్ ప్రస్తుతం రూ.2750కి పెరిగిందన్నారు. పింఛన్‌ను రూ.3 వేల వరకు పెంచుతానన్న సీఎం, తన మాటను నిలబెట్టుకొంటున్నారన్నారు. ప్రజలు కూడా ఆయనకు మద్దతుగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉరుకూటి అప్పారావు, మల్లేశ్వరరావు, పుర్రి సత్యనారాయణ, వాసవి నాయుడు, భవానీ తదితరులు పాల్గొన్నారు.

డ్రై డే పాటిస్తే వ్యాధులకు చెక్

డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

పెదగంట్యాడ: వారంలో ఒక రోజు.. ప్రతి శుక్రవారం ప్రతి ఒక్కరూ విధిగా డ్రైడే పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు కోరారు. జీవీఎంసీ 64వ వార్డు గంగవరం గ్రామంలో శుక్రవారం డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, డ్రమ్ములు, కుండీలపై మూతలు ఉంచాలని సూచించారు. తనకాల సత్యనారాయణ, ధనరాజు, ప్రమీల, దేవి తదితరులు పాల్గొన్నారు.

– జెడ్పీ సింహాచలం 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో పర్యటించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ పాల్గొన్నారు.

నీటిని నిల్వ ఉంచొద్దు

గాజువాక : ఇళ్లలో, ఇంటి పరిసరాల్లోను నీటిని నిల్వ లేకుండా నివాసులు చూసుకోవాలని కోరుతూ గాజువాక పీహెచ్‌సీ సిబ్బంది ప్రచారం నిర్వహించారు. 72వ వార్డు చినగంట్యాడలో ఇంటింటికీ వెళ్లి దోమలు వ్యాప్తి చెందడానికి గల కారణాలను స్థానికులకు వివరించారు. 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ, సీహెచ్‌వో పి.నాగ అప్పారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

68వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించడం వల్ల మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులకు చెక్ పెట్టవచ్చని యాంటమాలజిస్ట్ వరహాలు దొర అన్నారు. 68వ వార్డు మిందిలో మంత్రి అమర్‌నాథ్ నివాసంతో పాటు పరిసర ప్రాంతాల్లోని నివాసాల్లో నీటి నిల్వలను తొలగించారు. మలేరియా హెల్త్ అసిస్టెంట్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అకుంఠిత దీక్షతో కార్యసిద్ధి



అంధ బాలికను ఆశీర్వదిస్తున్న రాజయోగిని

అగనంపూడి: అకుంఠిత దీక్ష, పట్టుదల ఉంటే ఏ కార్యమైనా సిద్ధిస్తుందని బ్రహ్మకుమారీస్ జిల్లా కో–ఆర్డినేటర్ త్రివేణి, జిల్లా ఇన్‌చార్జి రాజయోగి బీకే సోమేశ్వరి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఎక్సైజ్ డీఎస్పీ రాము అంధురాలైన తన కుమార్తెతో కలిసి అగనంపూడి బ్రాంచ్‌ను సందర్శించారు. దృష్టిలోపం ఉన్నప్పటికీ ఎంఏ (ఇంగ్లిష్) పూర్తి చేసి, గ్రూప్–2 పరీక్షలకు సన్నద్ధం కావడంపై బ్రహ్మకుమారీలు ఆమెను అభినందించారు. పట్టుదల ఉంటే ఏదైనా సుసాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో అగనంపూడి బ్రాంచ్ ఇన్‌చార్జి బీకే రామకోటి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి రూ. లక్ష విరాళం



ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులకు చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన ఆగమ పాఠశాల విద్యార్థుల సంక్షేమం నిమిత్తం నగరంలోని బీహెచ్‌పీవీ దరి అక్కిరెడ్డిపాలేనికి చెందిన ఆకుల మహేష్ అనే దాత రూ.లక్ష ఇచ్చారు. సింహగిరిపై సంబంధిత విరాళాన్ని చెక్కురూపంలో ఆలయ ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులకు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో నాయుడు, దేవస్థానం ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం గిరి ప్రదక్షిణ జరిగింది. పౌర్ణమి సందర్భంగా ఉదయం ఆరు గంటల నుంచి ప్రారంభమైన కార్యక్రమం ఆద్యంతం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, ఉదయ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు తిరువీధి ఉత్సవం జరగనుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

హెచ్‌ఎంఎస్ గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్ హెచ్‌ఎంఎస్ గౌరవాధ్యక్షునిగా వి. శ్రీనివాసరావు (పంతులు శ్రీను)ను ఎన్నుకున్నారు. ఎల్‌ఎంఎం పార్కులో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయనను ఎన్నుకున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా హెచ్‌ఎంఎస్ యూనియన్ పూర్తి స్థాయిలో పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు, ప్రధాన కార్యదర్శి జి. గణపతిరెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.